క్లుప్తంగా

కేసుల పరిష్కారానికి లోక్ అదాలత్ దోహదం



సమావేశంలో పాల్గొన్న న్యాయమూర్తులు

గాజువాక : గాజువాక కోర్టు కాంప్లెక్స్‌లో ఈ నెల 13న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు వినియోగించుకుని కేసులను పరిష్కరించుకోవాలని 13వ అదనపు జిల్లా న్యాయమూర్తి జి.షణ్ముఖరావు కోరారు. ఈ కార్యక్రమంపై గాజువాక న్యాయమూర్తులతో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజీ మార్గంద్వారా కేసులను పరిష్కరించుకోవడం వల్ల లభించే ప్రయోజనాలను న్యాయమూర్తులు కక్షిదారులకు వివరించాలన్నారు. జాతీయ లోక్ అదాలత్‌లో అధిక సంఖ్యలో కేసుల పరిష్కారానికి న్యాయవాదులు సహకరించాలని కోరారు. సమావేశంలో న్యాయమూర్తులు ఎస్.కవిత, ఎం.కె.శేషమ్మ, వి.పల్లవి, గాజువాక బార్ అసోసియేషన్ అధ్యక్షురాలు యశోదర వేదమణి తదితరులు పాల్గొన్నారు.

ఏపీఐఐసీ నిర్వాసితుల సమస్య పరిష్కారానికి కృషి



ముస్లిం పెద్దల సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే పల్లా

కూర్మన్నపాలెం: సుమారు నాలుగు దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న ఏపీఐఐసీ నిర్వాసితుల సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. ఫకీర్ తక్యా గ్రామస్తులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నిర్వాసితుల జాబితా రూపొందించి అందిస్తే ఆరు నెలల్లోగా నిర్వాసితులందరికీ ఇళ్ల పట్టాలందిస్తానన్నారు. 40 ఏళ్ల క్రితం భూములిచ్చిన రైతుల్లో చాలామంది వారసులు ఉన్నారు తప్ప, అసలైన రైతులు లేకపోవడం వల్ల సమస్యలు వస్తున్నాయన్నారు. దీని నుంచి బయటపడాలంటే 40 ఏళ్ల నాటి జాబితా ప్రకారం ఇళ్ల పట్టాలు అందజేయాలని ఎక్కువ శాతం మంది కోరుతున్నారు. సమావేశంలో టీడీపీ నాయకులు, ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల సంఘం నూతన కార్యవర్గం



కొత్తగా ఎంపికైన కార్యవర్గ సభ్యులు, ప్రతినిధులు

మల్కాపురం : విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల సంఘం (గాజువాక డివిజన్) నూతన కార్యవర్గం ఎన్నిక గురువారం నిర్వహించారు. రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు గాజువాక డివిజన్ పరిధిలో జరిగిన కార్యక్రమంలో పారిశ్రామిక ప్రాంత పరిధి 14 సబ్‌స్టేషన్‌ల నుంచి కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొని పాలక వర్గ సభ్యులను, ప్రతినిధులను ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడిగా వి.వి.స్వామి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పి.మురళి, కో - ఆర్డినేటర్‌గా కె.సుబ్రహ్మణ్యంమూర్తి, ప్రధాన కార్యదర్శిగా వి.సత్తిబాబు, ఫైనాన్స్ సెక్రటరీగా ఎం.శేషుబాబు, ఉపాధ్యక్షుడిగా ఎస్.శేఖర్ బాబు, పలువురిని సభ్యులుగా ఎన్నుకున్నారు. సంఘ సభ్యుల సంక్షేమానికి నిరంతరం శ్రమిస్తామని పాలకవర్గ సభ్యులు తెలిపారు.

మూడు వేల మందికి అన్నదానం



అన్న ప్రసాదం వడ్డిస్తున్న నర్సింగరావు, కనకారావు తదితరులు

గాజువాక: వినాయక నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా పాతకర్ణవానిపాలెంలో గురువారం భారీ అన్న సమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని స్థానిక నాయకులు కరణంరెడ్డి నర్సింగరావు, కరణం కనకారావు ప్రారంభించారు. సుమారు మూడు వేల మంది భక్తులు స్వామివారి ప్రసాదం స్వీకరించినట్టు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఉత్సవ నిర్వాహకులు, గ్రామపెద్దలు సిరసపల్లి అప్పారావు, కరణంరెడ్డి పవన్, మనోజ్, కరణం శ్రీను, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

భద్రం బీకేర్‌ఫుల్ భద్రరూ..

• ఉద్యోగుల భద్రతకు స్టీల్‌ప్లాంట్ చర్యలు • వాహనాలకు వేగ పరిమితి అమలు

ప్రమాదకర ట్రిపుల్ రైడింగ్





హెల్మెట్ ధరించని వ్యక్తిని ప్రశ్నిస్తున్న భద్రతా అధికారి

పరిమిత వేగంతోనే ప్రయాణం..

స్టీల్‌ప్లాంట్‌లో ప్రయాణించే ద్విచక్ర వాహనాలు, కార్లు, బస్సుల వేగం గంటకు 30 కిలోమీటర్ల మించరాదని ఆదేశాలు జారీ చేశారు. ప్లాంట్‌లో తిరిగే ద్విచక్ర వాహన చోదకులు హెల్మెట్ కచ్చితంగా ధరించాలని సూచించారు. ద్విచక్ర వాహనంపై ట్రిపుల్ రైడింగ్ నిషేధించారు. మొబైల్ మాట్లాడుతూ వాహనం నడపడం తదితర అంశాలపై ప్లాంట్‌లో స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. డ్రైవ్‌లో భాగంగా ఉక్కు భద్రతా అధికారులు, హోంగార్డులు ఆయా కూడళ్లలో నిఘా పెట్టారు. వారికి స్పీడ్ గన్‌లు కూడా ఏర్పాటు చేశారు.

ఉద్యోగులకు సూచనలు..

ఇటీవల ప్లాంట్‌లో వేగంగా వెళ్లే వాహనాలు, హెల్మెట్ లేకుండా వెళ్లే వాహనాలు, ట్రిపుల్ రైడింగ్‌లను గుర్తించి వాటిని రికార్డు చేశారు. ఆయా వాహనాల నంబర్ల ఆధారంగా ఆయా విభాగాల్లోని ఉద్యోగులకు విభాగాధిపతుల ద్వారా లేఖలు అందజేశారు. కాంట్రాక్ట్ కార్మికులకు ఆయా కాంట్రాక్టర్ల ద్వారా యాజమాన్యం సందేశం, సూచనలు తెలియజేశారు. వాటిని మరలా అతిక్రమిస్తే చర్యలు తప్పవని సుతిమెత్తగా తెలియజేశారు. ఇప్పటి వరకు సుమారు 40 మంది వరకు ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికులను గుర్తించి ఆయా విభాగాధిపతుల ద్వారా లేఖలు పంపారు. వాటిని ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికుల కుటుంబ సభ్యులకు చేరేలా ఏర్పాటు చేశారు.

ఉక్కునగరం: అతి వేగం అనర్థం. స్పీడ్ థ్రిల్స్.. బట్ కిల్స్ అనే నినాదాలు నిత్యం చూస్తుంటాం. అవి నినాదాలుగానే మిగిలి పోతున్నాయి. అవసరార్థం వాటిని అతిక్రమించి ప్రమాదాల బారిన పడుతుంటాం. భద్రత అనే అంశంపై దేశాలు, ప్రభుత్వాలు, పరిశ్రమలు వివిధ రకాల చర్యలు తీసుకుంటున్నాయి. అయినా ప్రమాదాలు జరుగుతున్నాయంటే అవి కచ్చితంగా నిర్లక్ష్యానికి ఉదాహరణలు అని చెప్పక తప్పదు.

ఉద్యోగుల భద్రతకు పలు చర్యలు..

స్టీల్‌ప్లాంట్‌లో బయోమెట్రిక్ పద్ధతి పెట్టిన తర్వాత పరిశీలిస్తే ప్రమాదాలు పెరిగాయని చెప్పొచ్చు. నిర్దేశిత టైం లోగా స్కాన్ చేయకపోతే షార్ట్ వర్క్ తప్పదు. ఆ టైమ్‌లోగా చేరుకోవాలనే ఆత్రుతతో వేగంగా ప్రయాణిస్తున్నారు. తద్వారా ప్రమాదాల బారిన పడుతున్నారు. ఉద్యోగి ఇంటి నుంచి బయల్దేరే సమయం కొద్దిగా ముందుకు



స్పీడ్ గన్‌తో వాహనాలను పరిశీలిస్తున్న హోంగార్డులు

జరిపితే సురక్షితంగా విధులకు చేరుకోవచ్చు. కాని అలా జరగటం లేదు. ఆఖరి నిమిషంలో బయల్దేరటం హడావుడిలో ప్రమాదాల బారిన పడడం నిత్యకృత్యాలవుతున్నాయి. ఈ ప్రమాదాలను అరికట్టడానికి స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం



వేగంగా ప్రయాణిస్తున్న బైక్

వివిధ చర్యలు చేపట్టింది. ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికుల వాహనాల వేగ నియంత్రణ, ప్రమాదాల నివారణలో భాగంగా కొన్ని నిర్ణయాలు తీసుకుంది. అందులో భాగంగా స్టీల్‌ప్లాంట్‌లో వేగ పరిమితి నిర్ణయించింది. ప్రమాదాల నివారణకు హెల్మెట్ కచ్చితంగా ఉండాలని భావించింది. ప్లాంట్‌లో ట్రిపుల్ రైడింగ్ నిషేధించాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా భద్రతా విభాగానికి ప్రత్యేక ఆదేశాలు జారీ చేసింది. భద్రతా విభాగం యాజమాన్యం నిర్ణయం మేరకు అధికారులు, ప్లాంట్‌లోని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించే హోంగార్డులకు ప్రత్యేక సూచనలు చేసింది.

భద్రత పాటించేలా చూడండి..

యాజమాన్యం ఇచ్చిన లేఖలో ఉక్కు యాజమాన్యం ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికుల భద్రతకు అధిక ప్రాధాన్యం ఇస్తుందన్నారు. మీ కుటుంబ యజమాని ప్లాంట్‌లో వాహనం నడిపేటప్పుడు భద్రతా నిబంధనలు పాటించని విషయం తమ దృష్టికి వచ్చిందన్నారు. భద్రతా నియమాలు సక్రమంగా పాటించడం ద్వారా క్షేమంగా ఇంటికి చేరేలా నచ్చజెప్పాలని పేర్కొన్నారు.

దసరాకు ప్రత్యేక రైళ్లు నడపాలని వినతి

అగనంపూడి: విశాఖ నుంచి ఉభయ గోదావరి జిల్లాల ప్రయాణికులకు అనువుగా ఉండే విశాఖ నర్సాపురం ఎక్స్‌ప్రెస్, అలాగే సింహాద్రి ఎక్స్‌ప్రెస్‌లను నిలిపివేయడంతో ఈ ప్రాంత ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని, వాటిని వెంటనే పునరుద్ధరించాలని తూర్పు కోస్తా రైల్వే యూజర్స్ కన్సల్టేటివ్ కమిటీ సభ్యుడు కంచుమూర్తి ఈశ్వర్ రైల్వే అధికారులను వేర్వేరు వినతిపత్రాల్లో కోరారు. ఈ రెండు రైళ్లకు ఆక్యుపెన్సీతో పాటు డిమాండ్ ఎక్కువగా ఉండేదని, అయినా అధికారులు వీటిని ఎందుకు నిలిపివేశారో అర్థం కావడం లేదన్నారు. దసరా ఉత్సవాల సందర్భంగా విజయవాడ ఇంద్రకీలాద్రికి శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ జిల్లాల నుంచి లక్షలాది మంది భవానీ భక్తులు విజయవాడ వెళ్లనున్నారని, ఈ క్రమంలో శ్రీకాకుళం, విశాఖ, నర్సాపురం మధ్య ప్రత్యేక రైళ్లు నడపాలని ఆయన కోరారు.

మాజీ సైనికుడు పేరయ్యరెడ్డికి ఘన నివాళి



పేరయ్యరెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న తిప్పల నాగిరెడ్డి తదితరులు

పెదగంట్యాడ: జీవీఎంసీ 75వ వార్డు పరిధి నెల్లిముక్కు గ్రామ అధ్యక్షుడు, సమాజ సేవకుడు, మాజీ సైనికుడు నీలాపు పేరయ్య రెడ్డి మరణం బాధాకరమని మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. పేరయ్యరెడ్డి నివాసం వద్ద గురువారం నిర్వహించిన సంతాపసభలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ దల్లి గోవింద్, నాయకులు గొందేశి మహేశ్వరరెడ్డి, పులి రమణారెడ్డి, గొందేశి సత్యారావు, నీలాపు పరదేశి, లప్పన్న, శ్రీనివాసరెడ్డి. సుమన్‌రెడ్డి, గంట్యాడ గురుమూర్తి తదితరులు పాల్గొని అంజలి ఘటించారు.

నేత్రదానం ఒక సంప్రదాయంగా మారాలి

- స్వచ్ఛంద సంస్థలు, సంఘాలు ప్రజల్లో అవగాహన కల్పించాలి
- అగనంపూడి ప్రాంతీయ వైద్యాలయం సూపరింటెండెంట్ డాక్టర్ గోపీకృష్ణ

అగనంపూడి: నేత్ర సంరక్షణ, నేత్ర దానంపై ప్రజల్లో అవగాహన కల్పించాలని అగనంపూడి ప్రాంతీయ వైద్యాలయం సూపరింటెండెంట్ డాక్టర్ గోపీకృష్ణ అన్నారు. వాటి ఆవశ్యకతను వివరించాలని కోరారు. నేత్రదాన పక్షోత్సవాల సందర్భంగా అగనంపూడి ఏరియా ఆస్పత్రి ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన ర్యాలీలో ఆయన మాట్లాడారు. మరణానంతరం ప్రజలే నేత్రదానానికి ముందుకు వచ్చేలా క్షేత్రస్థాయిలో స్వచ్ఛంద సంస్థలు, యువజన, మహిళా, విద్యార్థి సంఘాలతో సమైక్యంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ఏటా అంధత్వంతో బాధపడేవారి



ర్యాలీలో మాట్లాడుతున్న అగనంపూడి ఆస్పత్రి సూపరింటెండెంట్ గోపీకృష్ణ

సంఖ్య పెరుగుతోందని, వారికి కంటి చూపును ప్రసాదించే శక్తి నేత్రదానం చేసే దాతలకే ఉంటుందన్నారు. నేత్రదానం ఒక సంప్రదాయంగా మారాలంటే విద్యార్థి దశలోనే అవగాహన అవసరమన్నారు. కార్యక్రమంలో కంటి వైద్యనిపుణురాలు డాక్టర్ ఆశాలత, వైద్యులు ప్రత్యూష, భక్తవత్సలం, రేష్మ, లలిత, రోజా, నర్సింగ్ సూపరింటెండెంట్ హేమలక్ష్మి, ఆప్తమాలిక్ అధికారి భారతీ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పూర్తిస్థాయిలో మౌలిక వసతుల కల్పన

గాజువాక: తమ వార్డు పరిధిలో పూర్తిస్థాయిలో మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేస్తున్నట్టు 72వ వార్డు కార్పొరేటర్ ఎ.జె.స్టాలిన్ తెలిపారు. వార్డులోని చైతన్యనగర్, ఎంప్లాయిస్ కాలనీలో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వార్డులోని ప్రధాన కూడళ్లలో హైమాస్ట్ లైట్లు అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. కోట్లాది రూపాయల జీవీఎంసీ నిధులతో సీసీ రోడ్లు, బీటీ రోడ్లు నిర్మించామని, పార్కులను అభివృద్ధి చేశామని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు లక్ష్మణరావు, దాసరి విజయ



హైమాస్ట్ లైట్లు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ స్టాలిన్

సాయి, జె.వీరయ్య, ప్రభు కుమార్, కన్నారావు, ఎస్.వి.సుబ్బారావు, జి.ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపండి

ఉక్కునగరం: విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని భారత చైతన్య యువజన (బీసీవై) పార్టీ అధ్యక్షుడు రామచంద్ర యాదవ్ కేంద్ర ఉక్కుశాఖ మంత్రి హెచ్‌డీ కుమారస్వామిని కోరారు. ఇటీవల రామచంద్ర యాదవ్ విశాఖ వచ్చినప్పుడు స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులు ఆయనను కలిసి స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిలుపుదలకు సహకరించాలని కోరారు. ఉద్యోగుల విజ్ఞప్తి మేరకు గురువారం ఆయన న్యూఢిల్లీలో కేంద్ర మంత్రిని కలిసి ఈమేరకు వినతి పత్రం అందజేశారు. 32 మంది ప్రాణత్యాగంతో సుమారు లక్ష మందికి ఉపాధి కల్పించిన స్టీల్‌ప్లాంట్ ప్రభుత్వ రంగంలో ఉంటేనే దేశ ఆర్థికాభివృద్ధికి మేలు జరుగుతుందన్నారు. గత నాలుగున్నరేళ్లుగా ఉద్యోగులు చేస్తున్న ఆందోళనను అర్థం చేసుకుని



కేంద్ర ఉక్కుమంత్రి కుమారస్వామికి వినతిపత్రం అందజేస్తున్న రామచంద్ర యాదవ్

ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలన్నారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించారని రామచంద్ర యాదవ్ చెప్పినట్టు స్టీల్‌ప్లాంట్ కార్మిక నాయకులు తెలిపారు.

తప్పుడు పత్రాలు సృష్టించిన వ్యక్తికి నోటీసులు

అగనంపూడి: తప్పుడు సర్వే నంబర్‌తో రిజిస్ట్రేషన్ చేయించుకున్న వ్యక్తులకు జిల్లా రిజిస్ట్రార్ నోటీసులు జారీ చేశారు. మాజీ సైనికోద్యోగి మేడిశెట్టి ఉమామహేశ్వరరావు తన భార్య శారద పేరుతో అగనంపూడి సెక్టార్-1లో స్థలాన్ని కొనుగోలు చేశారు. సదరు స్థలాన్ని అదే కాలనీకి చెందిన సత్యనారాయణ అనే వ్యక్తి తప్పుడు పత్రాలు సృష్టించి ఇంటి పన్ను వేయించుకుని తన భార్యకు గిఫ్ట్ డీడ్ చేసిన వైనంపై జిల్లా రిజిస్ట్రార్‌కు అందిన ఫిర్యాదు మేరకు పత్రాలు పరిశీలించారు. విచారణకు హాజరు కావాలని సత్యనారాయణకు జిల్లా రిజిస్ట్రార్ నోటీసులు జారీ చేసినట్టు ఉమామహేశ్వరరావు తెలిపారు

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గాజువాక: ఆటోనగర్ విద్యుత్ సబ్ స్టేషన్ ఎయిర్ ఫీడర్ పరిధిలో శనివారం మరమ్మతులు, చెట్ల తొలగింపు కార్యక్రమం చేపట్టనున్నట్టు ఈపీడీసీఎల్ జోన్-2 ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బి.కె.నాయుడు తెలిపారు. ఈ కారణంగా విశ్వేశ్వరయ్యనగర్, శ్రీరాంనగర్ గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు. 11కేవీ తుంగ్లాం ఫీడర్ పరిధిలో భూగర్భ కేబుళ్లకు సంబంధించిన పనులు నిర్వహించనున్నట్టు తెలిపారు. దరిమిలా రెడ్డి తుంగ్లాం, కాపు తుంగ్లాం గ్రామాలకు శనివారం ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

శక్తి యాప్‌తో మహిళలకు భరోసా



మాట్లాడుతున్న సీఐ మల్లేశ్వరి

గోపాలపట్నం : శక్తి యాప్‌తో మహిళలకు భరోసా లభిస్తుందని సీఐ మల్లేశ్వరి అన్నారు. గురువారం ఉదయం గోపాలపట్నం బాలాజీ హైస్కూల్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. శక్తి యాప్‌ను అందరూ డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. దీని వల్ల మహిళలకు రక్షణ లభిస్తుందన్నారు. ఈ యాప్‌ను ఏవిధంగా వాడాలో వివరించారు. అనంతరం ఉపాధ్యాయుల ఫోన్లలో యాప్ డౌన్‌లోడ్ చేయించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ దివ్యభారతి, హెచ్‌సీ వెంకటరావు, కానిస్టేబుళ్లు జగన్నాథం, లీలా పార్వతి,శిరీష పాల్గొన్నారు.

గణపతి మండపాల్లో అన్న సమారాధనలు



75వ వార్డులో భక్తులకు అన్నప్రసాదం వడ్డిస్తున్న మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి



76వ వార్డులో అన్నప్రసాదం సిద్ధం చేసిన మహిళలు

పెదగంట్యాడ: గణపతి ఉత్సవాలను పురస్కరించుకుని యువత భారీ అన్నసమారాధనలు ఏర్పాటు చేయడం అభినందనీయమని మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. వినాయక నవరాత్రి మహోత్సవాలలో భాగంగా 75వ వార్డు గొందేశి వీధిలో కుంచమాంబ యువజన సంఘం ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటు చేసిన అన్న సమారాధనను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ దల్లి గోవిందరెడ్డి, నాయకులు గొందేశి పెదరెడ్డి, తిప్పల సతీష్‌రెడ్డి, గొందేశి అప్పలరెడ్డి, దల్లి అప్పలరెడ్డి, సూరిబాబు, యశ్వంత్, కార్తిక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● జీవీఎంసీ 76వ వార్డు పరిధి నడుపూరులో సీజీ స్టార్ యూత్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున అన్నదానం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అన్న ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో సీజీ స్టార్ సభ్యులు పాల్గొన్నారు.

87వ వార్డులో..

కూర్మన్నపాలెం: గణపతి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా 87వ వార్డులో ఏర్పాటు చేసిన మండపం



87వ వార్డులో అన్నసమారాధనలో పాల్గొన్న కోమటి శ్రీనివాసరావు దంపతులు

వద్ద ఏర్పాటు చేసిన అన్న సమారాధనను స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుడు కోమటి శ్రీనివాసరావు ప్రారంభించారు. కార్యక్రమంలో ఎ.జగన్నాథరావు, కోమటి రమాదేవి, బంగార్రాజు, బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

● అంబేడ్కర్ కాలనీలో జరిగిన అన్నసమారాధనకు వైఎస్సార్‌సీపీ నాయకుడు బి.గోవింద్ హాజరయ్యారు. కార్యక్రమంలో శ్రీనురాజు, కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

తరగతి గదిలోనే నవసమాజ నిర్మాణం

పెదగంట్యాడ: తరగతి గదుల్లోనే భావి భారతం రూపొందుతుందని రిటైర్డ్ గెజిటెడ్ హెచ్‌ఎం షేక్ మీరా, ఇస్లాంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయిని గేదెల ప్రమీల అన్నారు. దేశ భవిష్యత్తు బాలలే అన్నారు. గురుపూజోత్సవం సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సత్కార కార్యక్రమంలో వారు మాట్లాడారు. విద్యార్థులను ఉత్తములుగా తీర్చిదిద్దడానికి గురువులు చేస్తున్న కృషిని, పడుతున్న ఆరాటాన్ని విద్యార్థులు గుర్తించిన నాడే నిజమైన గురు పూజోత్సవం అన్నారు. అనంతరం విద్యార్థులు గెజిటెడ్ హెచ్‌ఎం షేక్ మీరా, హెచ్‌ఎం ప్రమీలతో పాటు సీనియర్ ఉపాధ్యాయిని షేక్ సబేరాను, పాఠశాలలోని



ఇస్లాంపేట హైస్కూల్ హెచ్‌ఎం ప్రమీలను సత్కరిస్తున్న విద్యార్థులు

30మంది ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయులు ఆనందరావు, మహమ్మద్ హక్, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పశువుల ఆస్పత్రి పరిశీలన

సింధియా : జీవీఎంసీ 40వ వార్డు పరిధి గాంధీగ్రామ్ పశువుల ఆస్పత్రిని పశు సంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ చంద్రశేఖర్ గురువారం సందర్శించారు. గాంధీగ్రామ్ పశువుల ఆస్పత్రి డాక్టర్ సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో హిందుస్థాన్ షిప్‌యార్డ్ టెక్నికల్ జనరల్ మేనేజర్ మహాపాత్రతో సమావేశమయ్యారు. గాంధీగ్రామ్ పశువుల ఆస్పత్రికి అద్దె లేకుండా చూడమని విజ్ఞప్తి చేశారు. సానుకూలంగా స్పందించిన షిప్‌యార్డ్ సంస్థ గతంలో లాగానే అద్దె చెల్లించకుండా ఆస్పత్రిని కొనసాగించుకోవచ్చని అంగీకరించినట్లు డాక్టర్ సునీల్‌కుమార్ తెలిపారు.

సింహగిరిపై కొనసాగుతున్న పవిత్రోత్సవాలు



స్వామికి తిరువీధి నిర్వహిస్తున్న అర్చకుడు, సిబ్బంది



తిరువీధిలో స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

సింహాచలం: సింహగిరిపై జరుగుతున్న పవిత్రోత్సవాల్లో భాగంగా మూడవరోజు గురువారం విశేషంగా హోమాలు, పారాయణలు జరిగాయి. సాయంత్రం స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను పల్లకిలో వేంజేపచేసి సింహగిరి మాడవీధుల్లో తిరువీధి వైభవంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామిని దర్శించుకున్నారు. రాత్రి పవిత్రాల సమర్పణ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులను, చక్రపెరుమాళ్లను వేదికపై కొలువుంచారు. పవిత్రాలను అర్చకులు శిరస్సుపై పెట్టుకుని ఆలయ బేడామండపంలో ప్రదక్షిణ చేశారు. అనంతరం పవిత్రాలకు విశేష పూజలు జరిపి, ఉత్సవమూర్తులకు, ఆలయ ప్రాంగణాలకు, ఆలయ శిఖరానికి సమర్పించారు. విశేష హారతులు అందించారు. స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, కరిసీతారామాచార్యులు, అర్చకులు ఈ కార్యక్రమాలను జరిపారు. ఉత్సవాల్లో భాగంగా నాల్గవరోజు శుక్రవారం పవిత్రవిసర్జన జరగనుంది.

రోడ్డు ఆక్రమణపై ఫిర్యాదు

గాజువాక: నాతయ్యపాలెంలోని 32/7 డోర్ నంబర్ పరిధిలో మున్సిపల్ నిధులతో నిర్మించిన ఒక రోడ్డును ఆక్రమించి సాగిస్తున్న నిర్మాణాన్ని గ్రామస్తులు అడ్డుకున్నారు. ఈ విషయంపై జీవీఎంసీ గాజువాక జోనల్ అధికారులకు ఫిర్యాదు చేశారు. గాజువాక మున్సిపాలిటీగా ఉన్న సమయంలో రూ.6 లక్షల వ్యయంతో నిర్మించిన రోడ్డును ప్రస్తుతం ఒక వ్యక్తి ఆక్రమించి గోడ కట్టడానికి ప్రయత్నిస్తున్నాడని, గోడ నిర్మించి ఆ స్థలాన్ని అమ్మడానికి పథకం



రోడ్డును ఆక్రమించి సాగిస్తున్న నిర్మాణం

వేశాడని గ్రామస్తులు జోనల్ అధికారులకు వివరించారు. ఆ నిర్మాణం కారణంగా కాలువ పూడుకుపోయి మురుగునీరు వెళ్లడం లేదని, అధికారులు ఆ స్థలాన్ని పరిశీలించి శాశ్వతంగా పరిష్కరించాలని గ్రామ ప్రతినిధులు సాయికుమార్, బి.ప్రసన్నకుమార్, గొడ్డు నూకరాజు తదితరులు కోరారు.